క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం , మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వెంకన్నకు తోమాల సేవ




పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రబాత సేవ చేశారు. అనంతరం తోమాల సేవ, సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వినతి

పరవాడ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎంఈవో కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ నెలకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని, యూనిఫారం, బీమా సౌకర్యం కల్పించడంతో పాటు మెస్ చార్జీలు పెంచి ఐడీ కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు పి.మాణిక్యం , ఈశ్వరమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో 6 నుంచి రెండో దశ బయోమెట్రిక్



బయోమెట్రిక్ మిషన్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లోపల విభాగాల్లో రెండో దశ బయోమెట్రిక్ అమలు ఈనెల 6 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బయోమెట్రిక్ అమలు ప్రారంభించింది. స్టీల్‌ప్లాంట్ లోపలి విభాగాల్లో మొదటి దశగా జనవరి 12 నుంచి 5 విభాగాల్లో బయోమెట్రిక్ అమలు ప్రారంభించారు. మిగిలిన 42 విభాగాల్లో ఈనెల 6 నుంచి ప్రారంభించనున్నారు. ఈనెలాఖరు వరకు బయోమెట్రిక్‌తో పాటు ప్రస్తుతం ఉన్న అటెండెన్స్ పద్ధతి కొనసాగుతుంది. మార్చి 1 నుంచి బయోమెట్రిక్ ద్వారా మాత్రమే అటెండెన్స్ గణింపు జరుగుతుందని పేర్కొన్నారు.



సంక్షేమ వెలుగు.. ప్రగతి పరుగు

సంక్షేమంతో ఆ పల్లె వాసుల జీవితాల్లో వెలుగు వచ్చింది. అభివృద్ధి **పనులతో** ప్రగతిబాట పట్టింది. సంక్షేమానికి అభివృద్ధి తోడవడంతో ప్రగతి **పథంలో నడు**స్తోంది. మొన్నటి వరకూ నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన **పంచాయ**తీల్లో ఒకటైన పెదగాడి నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో అగ్రపథా**న నిలిచింది.**

- సంక్షేమం ద్వారా ప్రజలకు రూ.22.6 కోట్ల పంపిణీ
- దాదాపు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు
- మారిన పెదగాడి గ్రామ స్వరూపం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నాడు: అధ్వానంగా ఉన్న పెదగాడి ప్రాథమికోన్నత పాఠశాల



నేడు: రూ.42 లక్షలతో అత్యంత సుందరంగా నిర్మించిన పెదగాడి ప్రాథమికోన్నత పాఠశాల

పెందుర్తి: మండంలోని పెదగాడి పంచాయతీ అభివృద్ధి చెందిన పంచాయతీల సరసన చేరింది. సర్పంచ్ కేసుబోయిన లావణ్య త్రినాథ్ సారథ్యంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో గ్రామ రూపురేఖలు మార్చారు. పెదగాడి సచివాలయం(చింతలగ్రహారం పంచాయతీతో కలిపి) పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.22.6 కోట్లు కేవలం సంక్షేమ పథకాల ద్వారానే పంపిణీ చేసింది. ఇక అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.7 కోట్లు కేటాయించింది. పలు పనులు పూర్తి చేయగా మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. దీంతో పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమం...

➡ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పెదగాడి సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వివిధ పథకాల కింద రూ.22.6 కోట్లు ఖాతాల్లోకి చేరాయి. ఇందులో అమ్మ ఒడి పథకం ద్వారా 411 మందికి రూ.1,82,36,800 అందింది.

➡జగనన్న విద్యా దీవెన పథకంలో 319 మందికి రూ.1,09,72,971, జగనన్న వసతి దీవెన పథకంలో 269 మందికి రూ.1,24,42,000 అందాయి.

➡వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.255 మంది రైతులకు రూ.39,41,771 నగదు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా ఆరుగురికి రూ.19,683, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఆరుగురికి రూ.13,620 ఖాతాల్లో జమైంది. మత్స్యకార భరోసాలో ఇద్దరికి రూ.30 వేలు అందింది.

➡వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 529 మందికి రూ.5,27,79,500 నగదు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా అవ్వాతాతలకు చేరింది.

➡వైఎస్సార్ చేయూత ద్వారా 332 మందిఅక్కచెల్లెమ్మలకు రూ.1,45,68,750 అందింది.

➡వైఎస్సార్ ఆసరా(డ్వాక్రా రుణమాఫీ) ద్వారా 681 మందికి రూ.1,63,77,509 నగదు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో పడింది.

➡వైఎస్సార్ సున్నావడ్డీ పథకం(ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు) ద్వారా 1,017 మందికి రూ.14,04,550 నగదు అందింది.

అభివృద్ధికి పెద్దపీట

- పెదగాడి పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం **రూ.7 కోట్లు** వెచ్చించారు.
- పెదగాడి శీలగట్టు నుంచి చింతగట్ల రహదారి రూ.4.50 కోట్లతో పూర్తి చేశారు.
- రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి **రూ.21.8 లక్షలు** వెచ్చించారు.
- రూరల్ వెల్‌నెస్ సెంటర్(ఆరోగ్య కేంద్రం) నిర్మాణానికి **రూ.17.5 లక్షలు** కేటాయించారు.
- గ్రామ సచివాలయం నిర్మాణం **రూ.25 లక్షలతో పూర్తి చేశారు.**

➡వైఎస్సార్ కాపు నేస్తం ఎనిమిది మందికి రూ.1,65,000 వేలు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం నలుగురికి రూ.1,05,000 వేలు అందాయి.

➡డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో 205 మంది చికిత్స చేయించుకోగా వారికి రూ.73,62,800 బిల్లులు ప్రభుత్వం చెల్లించింది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా 96 మందికి రూ.7,86,275 లబ్ధి చేకూరింది.

➡హౌసింగ్(లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు) ద్వారా 147 మందికి రూ.1,73,78,950 చెల్లింపులు జరిగాయి.

➡వైఎస్సార్ బీమా ద్వారా 7 కుటుంబాలకు రూ.13,60,000 బీమా నగదు చెల్లించి అండగా నిలిచింది ప్రభుత్వం.

➡వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా 143 మంది ఆటో, కార్మికుల ఖాతాల్లో రూ.46,40,000 పడ్డాయి.

➡వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఒకరికి రూ.72 వేలు, జగనన్న చేదోడు(రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలు) 30 మందికి రూ.7,60,000 నగదు చెల్లించి చేయూతనిందించింది.

➡జగనన్న తోడు పథకం ద్వారా 141 మందికి రూ.66,710 చెల్లింపులు జరిగాయి.

జగనన్న ఎంతో మేలు చేశాడు



మా పంచాయతీ ఐదేళ్ల కిందట వరకూ అభివృద్ధికి చాలా దూరంలో ఉంది. మా ఊరు రావాలంటే చాలా మంది సంకోచించే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు మా గ్రామం చాలా అభివృద్ధి చెందింది. అన్ని సేవలు మా గ్రామంలోనే అందుతున్నాయి. జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం.

– కోరుబిల్లి నాగరాజు, పెదగాడి

వైద్య సేవలు భేష్



మాది చాలా మారుమూల గ్రామం. గ్రామంలో ఎవరికైనా ఒంట్లో బాగోపోతే పెందుర్తి వెళ్లాల్సి వచ్చేది. పెద్ద ఆరోగ్య సమస్య అయితే కేజీహెచ్‌కు వెళ్లే వారం. ఉదయం వెళితే సాయంత్రం తిరిగి వచ్చేవారు. ఇప్పుడు జగనన్న దయ వలన మా గ్రామానికే వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మాకు ఎన్ని మందులు ఇస్తున్నారు.

– ఎం.ప్రియాంక, పెదగాడి

అభివృద్ధికి మారుపేరుగా..



గత 20 ఏళ్లుగా పంచాయతీలో అభివృద్ధి జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా పంచాయతీ రూపురేఖలే మారిపోయాయి. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగింది. అభివృద్ధిలో కూడా మా పంచాయతీ ముందుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లకు ధన్యవాదాలు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని మేమంతా కోరుకుంటున్నాం.

– కేసుబోయిన లావణ్య త్రినాథ్, సర్పంచ్ పినగాడి.

రూ. 3.48 కోట్లతో అభివృద్ధి పనులు



రావలమ్మపాలెంలో ఎంపీపీ సూర్యకుమారితో కలిసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- నాయకులతో కలిసి నిర్మాణాలు, భవనాల ప్రారంభోత్సవం

సబ్బవరం: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో పూర్తి చేసిన పలు ప్రభుత్వ భవనాలు, పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో సచివాలయంలో కనీసం రూ.15 కోట్లు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కింద ఖర్చు చేసినట్టు వివరించారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు,విత్తనాలు గ్రామాల్లోనే అందించే విధంగా రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అందువల్ల ఎన్ని పార్టీలు పొత్తులు పెట్టుకుని కుయుక్తులు పన్నినా ప్రజలంతా జగన్ మోహన్‌రెడ్డి వెంటే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవాలు ఇలా..

మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలో రూ.3.48 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను,ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చారు.

- మల్లునాయుడుపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ అదనపు అంతస్తుతో పాటు రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు.
- బోదువలసలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ అదనపు ఫ్లోర్‌ను ప్రారంభించారు.
- అంతకాపల్లి లో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ అదనపు అంతస్తుతో పాటు నాడు- నేడులో భాగంగా రూ.46.20 లక్షలతో, రూ.20.13 లక్షలతో చేపట్టిన ఎంపీపీ పాఠశాలను ప్రారంభించారు.



రావలమ్మపాలెంలో ఇంటింటి తాగునీటి కుళాయిలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- రావలమ్మపాలెంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.43.39 లక్షలతో ,అంతకాపల్లిలో రూ.29.28 లక్షలతో పూర్తి చేసిన ఇంటింటి తాగునీటి కుళాయిలను, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రంతో పాటు రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్ నెస్ సెంటర్‌ను ప్రారంభించారు.
- వంగలి సచివాలయం పరిధిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రాంభించారు.
- ఆరిపాక సచివాలయం పరిధిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని,రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు.

కార్యక్రమాల్లో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్,మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, ఎంపీడీవో రామ్మోహనరావు, సీనియర్ నాయకులు,సర్పంచ్‌లు,ఎంపీటీసీలు బోకం రామునాయడు,బోను గంగునాయుడు,బోను దేవుడమ్మ,సబ్బవరపు నారాయణమూర్తి,పాలిశెట్టి పార్వతి,నేబర్తి శ్రీను,ఉగ్గిన దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పరవాడ: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో రూ.3.03 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. తానాం , పరవాడ, వెన్నలపాలెం, కలపాక, నాయుడుపాలెం,గొల్లగుంట గ్రామాల్లో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో మండలంలో పార్టీ ముఖ్య నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళపై అసభ్య పోస్టర్లు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

పెందుర్తి: వ్యక్తిగత కక్షలతో ఓ మహిళను కించపరుస్తూ మరో మహిళ అసభ్య పోస్టర్లు అతికించింది. పెందుర్తి పాతూరులో జరిగిన ఈ ఘటనపై బాధితురాలు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. పెందుర్తి పాతూరులో నివాసం ఉంటున్న ఓ యువతికి, మరో మహిళకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. దీంతో సదరు మహిళ యువతి ఫొటోపై ఆమె ఫోన్ నంబర్లు రాసి వేశ్యగా చిత్రీకరించింది. ఆయా పోస్టర్లను వీధుల్లోని ఇంటి గోడలపై అతికించింది. శనివారం ఉదయం బాధితురాలు వాటిని గమనించి వెంటనే పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు విచారిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



దేదీప్ (ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రి పాలెం వుడాలేఅవుట్‌లో నివాసముంటున్న ధరిణికల దేదీప్(23) నివసిస్తున్న అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుంచి శనివారం దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మర్రిపాలెం వుడాలేఅవుట్ శివశివాని పాఠశాలకు వెళ్లే దారిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సొంత ఫ్లాట్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు.

కాగా శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇబ్బంది పడడంతో శనివారం ఉదయం 10.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లేందుకు బయలు దేరారు. ద్విచక్రవాహనం తీసిన దేదీప్ వాషరూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పి పైకి వెళ్లి దూకేశాడు. వెంటనే 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేదీప్ బీటెక్ పూర్తి చేసి గేట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ యాదవ్ కేసు దర్యాప్తు చేపట్టారు.

సంక్షేమానికి దీటుగా అభివృద్ధి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



పురుషోత్తపురంలో తారు రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: సంక్షేమం..అభివృద్ధి రెండు కళ్లుగా బావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నియోజకవర్గాన్ని సంక్షేమంతో పాటు అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రూ.63.40 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న వెంకటాద్రి రెండో ఘాట్ నిర్మాణానికి, జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో మహతి పాఠశాల నుంచి కంఫర్ట్ హోమ్స్ వరకు రూ.1.68 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జీవీఎంసీ పరిధిలోపి ప్రతి కాలనీ అభివృద్ధి పథంలో నిలవాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముమ్మన దేముడు, పీలా శ్రీనివాసరావు, నాయకులు, వెంకటాద్రి ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 98వ వార్డులో రూ.77.36 లక్షల పనులకు శంకుస్థాపన



98వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలో రూ.77.36 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. శిడగంపేటలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.

చేపట్టనున్న పనుల వివరాలు

- అడవివరం ప్రభుత్వ ఆస్పత్రి వెనుక నుంచి స్వామి కల్యాణ మండపం వరకు రూ.19.75లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కల్వర్టు నిర్మాణం
- ఆకులవీధిలో రూ.12.68 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ కల్వర్టు
- రూ.14.75లక్షలతో గాంధీనగర్‌లో సీసీ రోడ్డు, సీసీ కల్వర్టు నిర్మాణం
- రూ.13.70లక్షలతో టీవీ టవర్ కాలనీలో సీసీ రోడ్డు, సీసీ కల్వర్టుతో పాటు రూ.16.50లక్షలతో హరిహరానందనగర్‌లో బీటీ రోడ్డు పనులకు ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం , వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, దొంతల సంతోష్, శిడగం తాతబాబు పాల్గొన్నారు.

‘పది’లో మెరుగైన ఫలితాలే లక్ష్యం

గురుకులాల జిల్లా కన్వీనర్ సత్యారావు



టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు

విశాఖ విద్య: గురుకులాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సత్కరిస్తున్నారు. సింహాచలం బీసీ సంక్షేమ గురుకులంలో శనివారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. గురుకులాల జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు హాజరైన విద్యార్థులను ఉత్తేజపరిచారు. పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివితే విజయం తథ్యమన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా చదువుకోవాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఉన్న మూడు బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున సబ్జెక్టు టీచర్లు తగిన శ్రద్ధ తీసుకొని విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులను, ఇందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డ దరి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మృదుల ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఇంటర్‌లో చేరే వారికి అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు విద్యార్థి పాస్‌పోర్టు ఫొటో ఆధార్ జిరాక్స్ కాని తీసుకుని స్కూల్‌కు వస్తే ఎటువంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తామని తెలిపారు. సందేహాలు ఉంటే పూర్తి వివరాల కోసం 5వ తరగతిలో చేరే వారు 93984 69906, 77319 31386 నంబర్లలో, ఇంటర్‌లో చేరేవారు 97034 66990, 97038 84235 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కాలుష్యాన్ని అరికట్టాలని ఆందోళన



ఎగసిపడుతున్న ధూళి

పరవాడ: ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల నుంచి ఫ్లైయాష్‌ను తరలించే లారీల నుంచి విడుదలవుతున్న కాలుష్యాన్ని తక్షణమే అరికట్టాలని కలపాక శివారు గొల్లలపాలెం గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. కలపాక, గొల్లలపాలెం మీదుగా ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల నుంచి బూడిదను తరలించే లారీలను ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం అడ్డగించి నిరసన తెలిపారు. బూడిద తరలించే ప్రక్రియలో సరైన చర్యలు చేపట్టక పోవడంతో కింద పడుతున్న బూడిద గాలిలో ఎగరడం వల్ల కంటి సమస్యలతో పాటు ఊపిరితిత్తులు, కిడ్నీ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ పంటలు నాశనమవుతున్నాయని వాపోయారు. ఫ్లైయాష్ లారీలను అడ్డగించిన విషయం తెలుసుకున్న సీఐ ఎస్.బాలసూర్యారావు గ్రామానికి చేరుకొని నిరసనకారులతో చర్చలు జరిపారు. కాలుష్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

7న జీడిమామిడి తోట ఫలసాయానికి బహిరంగ వేలం

సబ్బవరం: మండలంలోని లిగాలతిరుగుడులో కొలువైన స్వయంభూ సోమలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన జీడిమామిడి తోట ఫలసాయానికి బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఆదినారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబర్ 79లోని 3.50 ఎకరాల జీడి మామిటి తోట ఏడాది ఫలసాయానికి, సర్వే నెంబర్‌లు 70/7,70/11లలోని 3.60 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఫలసాయం 3 సంవత్సరాలకు గాను ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద నిర్వహించే బహిరంగ వేలం పాటలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని ఈవో కోరారు.

1,087వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం; విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1087వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.